పోస్టుమన్ చేసిన తమాషా

మూర్తి తాళం తీసి తలుపు లోపలకు నెట్టేసరికి అక్కడ ఒక ఉత్తరం పడిఉంది. అతనికి వచ్చే ఉత్తరాలన్నీ సామాన్యంగా ఆఫీసుకే వస్తాయి. అలాంటిది ఈవేళ ఈ ఉత్తరం పోస్టుమన్ తలుపు సందులోనుంచి పడవేసి వెళ్లాడేమా అని ఆశ్చర్యపోతూ అడ్రసు చూశాడు. తన పేరే ఉంది. కవరుచించి లోపల చదివాడు. ఏమీ బోధపడలేదు. ఉత్తరం చివర చూశాడు: కె. వెంకటప్పయ్య అని ఉంది. ఎవరూ ఈ వెంకటప్పయ్యగారు? — తనెన్నడూ ఎరుగడే! తన బంధువులలో ఈ పేరున్న వారున్నట్లు అతనికి జ్ఞాపకం లేదు. ఈ వ్యక్తి ఎవరో తనని అతి చనువుగా సంబోధిస్తున్నాడు. అపరిచిత వ్యక్తి తననలా సంబోధించినందుకు అతనికి అసహ్యం కూడా వేసింది. అయినా ఉత్తరం జాగ్రత్తగా చదివాడు. అది ఇలారాసి ఉంది:

"చిరంజీవి మూర్తికి ఆశీర్వాదాలు. నీకు నేను జ్ఞాపకం ఉండే ఉంటాననుకుంటాను. మీ నాన్న మా ఆవిడ మేనత్తకు మరిది. నీ పెళ్లికి మేమంతా కూడా వచ్చాము. అప్పటికి మా మూడో అమ్మాయి కాంతం, అబ్బాయి రాముం పుట్టలేదు. పెద్దమ్మాయిలిద్దరికీ మా ఆవిడ బ్రతికుండగానే పెళ్లిళ్లు చేసేశాను. వాళ్లిద్దరూ ఇప్పుడు కాపురాలు చేస్తున్నారు. పిల్లలుకూడా బయలుదేరారు. ఇప్పుడు మా మూడో అమ్మాయి కాంతానికి పెళ్ళిచేయవలసి ఉంది. అది ఇంటర్మీడియేట్ వరకూ చదివి తప్పింది. కుర్రవాడు రాముం స్కూలుఫైనలు చదువుతున్నాడు. కాంతానికి సంబంధాలకోసం వెతుకుతున్నాను. కాని ఏదీ కుదరడంలేదు. ఆ పిల్లను చదివించడమే కొంపతీసింది. ఇప్పుడెంత లెంపలు వాయించుకుంటే మాత్రం ఏంలాభం? అది గొంతెమ్మ కోర్కెలు కోరుతోంది. దానికి ఇష్టంగా ఉండే సంబంధాలు నా తాహతులో లేవు. ఉన్న నాలుగెకరాలూ అమ్మివేస్తే రాముం గతి ఏంకాను? ఏదో రెండువేలవరకూ పోదామనుకున్నాను. అపైన పెళ్ళి ఖర్చులో రెండువేలవరకూ ఉండవచ్చు గదా. కాని ఈ రెండువేల సంబంధాలకు కాంతం సుతరామూ ఒప్పుకోవడంలేదు. చాలా సంబంధాలు తీసుకువచ్చాను. అవతల వాళ్లు ఇష్టపడుతున్నారు కూడా. అన్నీ సిద్ధపరచేయవచ్చు ననే వరకూ కూడా కొందరు వచ్చారు. తీరా మా కాంతం ఆ పెళ్ళికొడుక్కి లక్షవంకలు పెట్టడంవల్ల ఆ వచ్చినవారిని మర్యాదగా ఏవో కబుర్లు చెప్పి పంపివేయడం జరిగింది.

ఇలా చాలాసార్లు జరిగితే అప్రతిష్ఠకూడా వస్తుందని, ఈ పద్ధతి మానివేసి, సంబంధాల వాళ్లతో ముందు మాట్లాడక, వాళ్లున్నచోటికి కాంతాన్ని తీసుకువెళ్ళి అవతలు వారికి తెలియకుండానే దానికి కనిపించేటట్లు చేసి, పిల్లవాడు నచ్చాడంటే అప్పుడు సంబంధం విషయం మాట్లాడడానికి వెళ్తున్నాను. ఇలాకూడా అప్పుడే రెండుసార్లయింది. ఆ యిద్దరు వరుల్నీ కూడా ఒకడిని శూర్పణఖ రెండో అన్నగారి క్రిందా, ఇంకొకడ్ని తోకొక్కటే తక్కువయిన హనుమంతుడి క్రిందా కాంతం వర్ణించి చేయడంవల్ల ఆ సంబంధాల జోలికిపోలేదు.

మొన్న ఒకరు గుంటూరులో మంచి సంబంధం ఉందన్నారు. పిల్లవాడు బి. ఏ. ఆనర్సు పాసయినాడట. కాలేజీలో ట్యూటర్ గా ఉంటున్నాడట. కొద్దిగా ఆస్తికూడా ఉందట. కట్నం అతి పెద్దగా లేదట ఈ సంబంధమేనా కాంతానికి నచ్చుతుందేమో నని ఆశగాఉంది. కాని గుంటూరులో ఒకటి రెండు రోజులు బసచేసేందుకు బంధువులెవరూ లేరే అని చింతిస్తూ ఉండగా, అదృష్టవశాత్తు మొన్న మీ పెద్ద తండ్రికొడుకు కనిపించి నీవు గుంటూరులో పనిచేస్తున్నావనీ, మీ యింట్లో దక్కగా బసచేయవచ్చుననీ చెప్పాడు. దానితో ప్రాణం లేచివచ్చినట్లయింది. నిన్ను నీ పెళ్ళికి చూడడమే కాని దరిమిలా చూడలేదు కాబట్టి ఒకసారి నిన్నూ నీ భార్యా బిడ్డల్నీ చూడడంకూడా కలిసివస్తుందనీ — బహుశా నీవుకూడా ఈపాటికి పెళ్ళి తాపత్రయంలో పడిఉంటా వనుకుంటాను — నేను మా కాంతం, రాములతో రేపు సాయంత్రం అనగా శనివారం సాయంత్రం ఏడుగంటలకు అక్కడికి చేరేబండివిూద వస్తున్నాం. కాబట్టి నీవు స్టేషనుకువచ్చి మమ్మల్ని మీయింటికి తీసుకువెళ్లవలసింది. నీవురాకపోతే మేము చాలా చిక్కులు పడవలసి వస్తుంది. కాబట్టి తప్పక స్టేషనుకు రాగలవని ఆశిస్తున్నాను.

గ్రహించవలెను,
కె. వెంకటప్పయ్య.

P. S. నాకు కొంచెం పథ్యం. నాకు మాత్రం కూరలు చప్పిడిగా చేయించవలసింది. కె. వి."

ఉత్తరం అంతా చదివి పెద్ద నిట్టూర్పు విడిచాడు మూర్తి. 'ఎంతభారతం రాశాడు!' ఇంతకీ అసలుసమస్య అలాగే ఉంది. ఈ వెంకటప్పయ్యగారెవరో తేలలేదు. ఆయన ఉత్తరాన్ని బట్టి తనకు కలఫైయేళ్లయినా ఉండాలి. కాని తనకు ముప్పైయేళ్లే. పెళ్ళి తాపత్రయంలో పడి ఉంటావంటున్నాడు. కాని తనకు పిల్లలు పుట్టలేదు సరికదా భార్యకూడాపోయి నాలుగేళ్లయింది. తనకు పెదతండ్రి ఎవరూ లేరు. అటువంటప్పుడు పెదతండ్రికొడుకు ఎలా ఉంటాడు? మరి ఈ ఉత్తరం అంతా ఏమిటి? అప్పటికి తోచింది మూర్తికి ఈ ఉత్తరం తనకుకాదనీ, తన పేరుగలాయనే ఆవూళ్లో మరొకరుండి ఉంటారనీ, పోస్టుమన్ ఆయన కీయవలసిన ఉత్తరం తనకు తెచ్చి పడవేశాడనీ మర్నాడు పోస్టుమాన్ను పిలిచి ఈ ఉత్తరం అసలాయనకు చేరేటట్లు చేయాలనుకున్నాడు. మళ్ళీ ఒకసారి ఉత్తరంకేసి చూశాడు. "కాంతం" పెళ్ళి వ్యవహారం చదివి నవ్వుకున్నాడు. అంతలో అతనిదృష్టి వాళ్లు వస్తున్నామనే ముక్కమీద పడింది. అన్నట్లు వాళ్లు వచ్చేది ఆవేళే! బండి వచ్చేందుకు సరిగా గంట కూడాలేదు. ఇప్పుడా ఇంకొక మూర్తిగారికి ఉత్తరం అందజేయడానికి టైమేదీ? వాళ్లు వస్తారు. స్టేషనులో తమచుట్టంకోసం చూస్తారు. స్టేషనుకు రాకపోతే చాలా ఇబ్బందిపడతామనికూడా రాశారు. పోనీ తనుపోయి వారికి సాయంచేసినట్లాగూ అంటే ఇంకా రాత్రి భోజనం తయారుచేసుకోలేదు. (మూర్తికి స్వయంపాకం అలవాటులెండి) పైగా ఆ వెంకటప్పయ్యగారు తనకు చప్పిడిచేయించమంటున్నాడు. ఎక్కడి తంటా వచ్చిపడింది! దీనికంతటికీ కారణం పోస్టుమనే! పోస్టుమాన్ను గట్టిగా కోప్పడదామనుకున్నాడు. కాని కోపపడితే

★ పోస్టుమన్ చేసిన తమాషా ★

ఇకనుంచి తనకు వచ్చే ఉత్తరాలుకూడా ఆ మూర్తిగారికే ఇచ్చివేస్తాడేమోనన్న భయం వేసింది. అసలు పోస్టుమన్‌ను కోపపడినా కోపపడకపోయినా ముందు ఇప్పుడు చేయవలసిందేమిటి? పోనీ వాళ్లఇబ్బందులు వాళ్లు పడతారు తన కెందు కనుకుందామంటే మనస్సు ఒప్పలేదు. వాళ్లు ఆశపెట్టుకొని వస్తారు. పైగా రాత్రివేళ స్టేషనుకు రాకపోతే, పాపం, నిజంగానే చాలా ఇబ్బంది పడతారు. ఇవన్నీ ఆలోచిస్తూ కూర్చోవడానికికూడా టైంలేదు. ఈ ఉత్తరం గొడవలోపడిఇంకా కాళ్లూ చేతులేనా కడుక్కోలేదు. అందువల్ల త్వరత్వరగా ఆఫీసు బట్టలు విడిచేసి, కాళ్ళూ చేతులూ కడుక్కొని, లుంగీ కట్టుకొని, చొక్కా, మఫ్లరు వేసుకొని స్టేషనుకు బయలుదేరాడు మూర్తి. దారిలో ఒకరిద్దరిని కనుక్కున్నాడు తన పేరుగలవారు మరొకర్ని ఎరుగుదురేమోనని. ఎవరూ తెలియదన్నారు. నిరాశచేసుకొని స్టేషను చేరుకున్నాడు.

బండివచ్చేందుకు ఇంకా పదినిమిషా లుంది. మూర్తి ప్లాట్‌ఫారమ్ టికెట్ తీసుకొని బండివచ్చేలోగా రిఫ్రెష్‌మెంట్ రూంకుపోయి కూల్‌డ్రింకొకటి తీసుకువచ్చాడు. బండి వచ్చింది. జనం దిగుతున్నారు, ఎక్కుతున్నారు. అంతమందిలో ఆ వెంకటప్పయ్యగారినీ, ఆయన సంతానాన్నీ తెలుసుకోవడం ఎలా? ఎందరో ముసలివాళ్లు దిగుతున్నారు. పడుచువాళ్లు దిగుతున్నారు. మూర్తి ప్లాట్‌ఫారం ఆచివరనుంచి ఈ చివరవరకూ తిరిగాడు. ఒకవేళ అప్పుడే దాటిపోయారేమోనని కంగారుగా టికెట్ కలెక్టరుండేచోటికి వచ్చిపోయేజనాన్ని పరిశీలించసాగాడు. ప్లాట్‌ఫారం పలచబడింది. మధ్యలో ఒకచోట ఒక ఏభైఏళ్లు దాటినాయన, ఒక అమ్మాయి, అబ్బాయి అప్పుడే పెట్టెలో దిగి నిలబడి చూస్తున్నారు. వాళ్లే! అనుమానం లేదు. మూర్తి వాళ్లకేసి నడిచాడు. అతను రావడంచూసి రామం, కాంతం "ఆయనే కాబోలు నాన్నా," అన్నారు. వెంకటప్పయ్యగారుకూడా తమ చుట్టాన్ని చూసి చాలాఏళ్ళయింది కాబట్టి ఎలాఉంటాడో జ్ఞాపకంలేక మూర్తే తమ చుట్టం అనుకొని "ఏమోయ్, నీకోసమే చూస్తున్నాం. తీరా నీవు రావేమోనని భయపడిపోయాం. మాట దక్కించావులే" అంటూ నవ్వుతూ ముందుకు వచ్చారు. పరాయి ఆయన "నీవు" అని సంబోధించడం మూర్తికి కష్టంగాతోచినా మెల్లగానే అన్నాడు: "క్షమించాలి, నేను మీ చుట్టాన్ని కాదండీ. పొరబాటున మీ చుట్టానికి రావలసిన ఉత్తరం నాకు వచ్చింది. మీ రిబ్బంది పడతారేమోనని వచ్చాను." ఆయన వెంటనే తెల్లబోయారు. మీ పేరేమిటని అడిగారు. "ఆర్. గోపాలకృష్ణమూర్తి" అని చెప్పాడు మూర్తి. ఇతను తమ చుట్టరికం అర్థంచేసుకోలేదనే భావంతో ఆయన నవ్వుతూ అన్నారు: "ఇంకేమోయ్, నువ్వే. నీకు మన చుట్టరికం సరిగా అర్థంకాలేదనుకుంటాను. మీనాన్నగారు మా ఆవిడకు స్వయానా మేనత్త మరదేనోయ్. మొన్ననేకదూ మీ పెద్దతండ్రి కొడుకు కనిపించి నీవిక్కడ పనిచేస్తున్నావని చెప్పింది." "క్షమించండి, నాకు పెద్దతండ్రి ఎవరూలేరు" అంటూ మూర్తి తన తండ్రిపేరూ, ఊరుపేరూ, వగైరాలు చెప్పి, "నాపేరూ మీ చుట్టం పేరూ ఒకటే అవడంవల్ల పోస్ట్‌మన్ ఒకరికీయవలసిన ఉత్తరం ఒకరికి ఇచ్చాడండి" అన్నాడు. వెంకటప్పయ్యగారు ఇప్పుడు పూర్తిగా నిశ్చేష్టులైపోయారు. అవును తన చుట్టం ఇంత పడుచువాడు కూడా కాదు! అప్పుడే కాంతం, రామం చెరో మూలనుంచి సణగడం ప్రారంభించారు: "నీ వెప్పుడు చేసినా ఇలాగే చేస్తావు నాన్నా. సరిగ్గా తెలుసుకోకుండా పిల్లి పిల్లల్ని తిప్పినట్లు తిప్పుతున్నావు మమ్మల్ని. ఈవేళ ఏ సత్రపు అరుగుమీదో పడుకోమంటావు." పాపం వెంకటప్పయ్యగారు తెల్లబోతూ కళ్ళజోడు తీసుకొని తుడుచుకొని, మళ్ళీ తగిలించుకొని తల గోకుకుంటూ మూర్తికేసి అర్థంలేని చూపు చూడసాగాడు. మూర్తి మొదట్లో వాళ్ళకు ఏ హొటలులోనో, సత్రవులోనో ఏర్పాటు చేసి వచ్చేద్దామనుకున్నాడు కాని వెంకటప్పయ్యగారి అవస్థ చూచేటప్పటికి అతనికి జాలికలిగింది. "ఇప్పుడేం చేస్తారు? మీరు మరో అభ్యంతరం లేకపోతే మాయింటికి రండి. ఈ రాత్రికి ఉందురుగాని. రేపు ప్రొద్దున్నే నేను మీ చుట్టాన్ని వెదకి తీసుకువస్తాను," అన్నాడు. కాంతం, రామం ఏ సత్రవు అరుగుమీదో మకాం తప్పిందని సంతోషించి 'పోదాం నాన్నా' అంటూ తండ్రిని చెరోపక్కా పట్టుకొని లాగసాగారు. ఆయన ఇంకా తికమక నుంచి బయటపడలేక 'సరే అలాగే కానీయండి' అన్నాడు.

బండి చేయించుకొని మూర్తి ఇంటికి చేరారు. మూర్తి తలుపుతీసి లైటు వేశాడు. కాంతం లోపలికి అడుగుపెట్టగానే 'అయ్యో చాలా చిన్న యిల్లే' అంది. మూర్తికి చిరాకువేసింది. చిన్నయిల్లు కాకపోతే పెద్దయిల్లు వస్తుందేమిటి? తానొంటరిగాడైనప్పుడు తన కంతకన్న పెద్ద ఇల్లెందుకు? రెండే గదులున్నాయి పడకగదీ, వంటగదీ, తన కంతకన్న అవసరంలేదు. ఏదో కష్టపడతారుకదా అని జాలిపడి పిలిస్తే తన ఇల్లు చిన్నదనీ పెద్దదనీ ఎవరు వ్యాఖ్యానించమన్నారు? రామం ఒళ్లు విరుచుకుంటూ అక్కడఉన్న మంచం మీద కూలబడ్డాడు. "అబ్బా వెధవ ప్రయాణం, వెధవరద్దీ! ఒళ్ళు హూనమయిపోయింది. నిద్ర కూరుకువస్తోంది. త్వరగా అన్నం తినేసి పడుకుంటే బాగుంటుంది"

అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు.(Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్‌సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రము బయలు వెడలటము. దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స, దీన్ని వాడటంవల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

ఆపలించాడు. వెంకటప్పయ్యగారు మూర్తి కేసి సందేహిస్తూ చూస్తూ "అయితే-" అంటూ నసుగుతూండగానే ఆయన ఏమి అడగదలుచుకున్నాడో మూర్తి గ్రహించి, "వంటకాలేదండీ. నాకే నేను వండుకోలేదు. మీ ఉత్తరం ఇందాకనే చూశాను. చూసిందే తడవుగా స్టేషనుకు వచ్చేశాను. వండుకోవడానికి కూడా టైం లేకపోయింది" అన్నాడు. "ఇంట్లో వారు లేరా?" అని ప్రశ్నించారు వెంకటప్పయ్యగారు. భార్య పోయిందని చెపితే అప్పుడా సమాచారం మీద వచ్చే ప్రశ్న పరంపరకు సిద్ధం కావడం ఇష్టం లేక మూర్తి "లేరు" అన్నాడు ముక్తసరిగా. వెంకటప్పయ్యగారు అనుకున్నారు—భార్యా వాళ్ళూ ఏ ఊరో వెళ్ళి ఉంటారని. అప్పుడు అంతకన్న ప్రశ్నించలేదు - ఒకమూల ఆకలి వేస్తూండడంవల్ల. మూర్తే అన్నాడు: "నేను పోయి హోటలు నుంచి భోజనం వచ్చే ఏర్పాటు చేస్తానండి"

"మరి నాకు చప్పిడికూర లెలా వస్తాయి" అన్నారు వెంకటప్పయ్యగారు. "అయిందిరా దేవుడా, ఇప్పుడు నన్ను వంట చేయమంటాడు కాబోలు, ప్రయాణంతో సగం చచ్చి ఉంటేను" అంటూ మూల్గింది కాంతం. "పోనీలే తల్లీ. నేనీ రాత్రికి భోం చేయనులే. సరే బాబూ వాళ్ళకు మాత్రం భోజనం తెప్పించండి. నాకు ఏ బత్తాయిపళ్లో తీసుకువస్తే గడుపుకుంటాను" అన్నారు. "వద్దులెండి, నేనే వంటచేస్తాను కావలసిన సరుకులు చూపిస్తేను" అంటూ కాంతం లేచింది. మూర్తి కాంతానికి వంటింట్లో సరుకులు చూపి తను వెళ్ళి హోటలులో భోజనం చేసి వస్తానన్నాడు. వెంకటప్పయ్యగారు రద్దు పెట్టారు "మీ యింట్లో నే మీరు భోం చేయకపోవడమేమిటి"ని. అందువల్ల మూర్తి ఆగిపోయి తనపని చూసుకోసాగాడు. వెంకటప్పయ్యగారు బడలిక మూలాన మాట్లాడకుండా కూర్చొని కునికిపాట్లు పడసాగారు. మరి కొంతసేపటికి వంటయింది. కాంతం తండ్రినీ, తమ్ముణ్ణీ లేపింది. మూర్తినికూడా పిలిచారు. భోజనాలయిన తర్వాత మూర్తి వాళ్లకు పరుపూ పక్కా చూపి "ఇదే నా యింట్లో ఉన్నది. ఎలాగో కాలక్షేపం చేయాలి మీరు, నేను మా స్నేహితుడింటికి పోయి పడుకొని ప్రొద్దున్నే వస్తా"నన్నాడు. వెంకటప్పయ్యగారు పెద్ద అడ్డు పెట్టలేదు. మూర్తి పొద్దున్నే వచ్చి వాళ్ల చుట్టంకోసం వెతుకుతానని మళ్ళీ చెప్పి బయలుదేరాడు. కాని ఇవతలకు వచ్చిన తర్వాత ఏ స్నేహితుడింటికి వెళ్లడమా అనే ప్రశ్న ఎదురైంది. నలుగురిళ్లకు వెళ్ళాడు కాని గడపవరకూ వెళ్లినతర్వాత పాపం వాళ్లి ఇబ్బంది పెట్టినవాడవుతానని ఆలోచించి, కాసేపు అక్కడా ఇక్కడా తిరిగి ఏమీ తోచక రెండో ఆట సినిమాకు వెళ్ళి అది అయినతర్వాత ఒక సత్రవు అరుగుమీదకు చేరి పడుకున్నాడు. కటికనేల చాలాసేపు నిద్రపట్టలేదు. ఆఖరికి ఎలాగో నిద్రపట్టిన గంటకల్లా కాకులు అరవసాగాయి. లేచి పోయేసరికి ఒళ్లంతా నొప్పులు చేసింది. అలాగే మొగం కడుక్కొని ఇంటికి బయలుదేరాడు.

అప్పటికి వెంకటప్పయ్యగారు మాత్రం లేచి భగవద్గీత పారాయణం చేసుకుంటున్నారు. కాంతం, రామం ఇంకా మంచి నిద్రలో ఉన్నారు. వెంకటప్పయ్యగారు మూర్తిని చూసి పిల్లల్ని లేపబోయారు. కాంతం ఊఁ ఊఁ అని మూలిగి ఇంకో ప్రక్కకు తిరిగి పడుకుంది. రామం ఎటు దొర్లిస్తే అటు దొర్లాడుకాని ఊఁ ఆఁ అని కూడా అనలేదు. మూర్తి "పోనీలెండి, వాళ్లనప్పుడే లేపడం ఎందుకులెండి పాపం ప్రయాణంలో, రాత్రి ఆలస్యంతో బడలి పోయి ఉంటారులెండి," అని దొడ్లోకి పోయి స్నానం చేసి వచ్చి బట్టలు వేసుకున్నాడు. వెంకటప్పయ్యగారి చుట్టం కోసం బయలుదేరబోయాడు. అప్పటికీ కాంతంకాని, రామంకానీ లేవలేదు. "త్వరగా లేవండర్రా, అమ్మాయి, పరాయి ఇంట్లో కూడా ఇలా నిద్రపోతే ఎలా చెప్పు. ఆయనకు కాస్త కాఫీ కాచియివ్వవూ," అంటూ వెంకటప్పయ్యగారు కాంతాన్ని కదుపుతున్నారు. "నాకు కాఫీ అలవాటు లేదండీ. నేను వెళ్ళి మీ బంధువు సంగతి కనుక్కొని వస్తాను" అంటూ మూర్తి వీధులు చేరాడు.

స్నేహితులనందరినీ అడిగాడు. వాళ్ళు మరొకళ్ళని అడగమన్నారు. వాళ్ళనీ అడిగాడు. అయినా లాభం లేకపోయింది ఆఫీసు వేళైపోయింది కాని అనుకున్న పని కాలేదు. ఆఖరికి ఆ పూటకు ఆఫీసుకి క్యాజుయల్ లీవ్ రాసి వేసి హెడ్ క్లర్కుకు ఇచ్చి వచ్చాడు. ఎలాగో అలాగా ఆ మనిషిని కనుక్కొని వెంకటప్పయ్యగారినీ వాళ్లనూ ఆయన కప్పజెప్పి భారం వదిలించుకుందామనుకున్నాడు. అందువల్ల యింటికి రాకుండానే ఒక హోటల్లో భోజనం చేసి మళ్ళీ వెతకడం ప్రారంభించాడు. 'పోస్టుమన్'ను అడిగాడు. వాళ్లకూ గుర్తులేదన్నారు. ఆ ఊళ్లో ఏ ఆఫీసులున్నాయో జ్ఞప్తికి తెచ్చుకొని, అక్కడికిపోయి పరిచితులద్వారా ఆ ఆఫీసులో తన పేరుగలవారెవరైనా ఉన్నారేమో కనుక్కోవడం మొదలు పెట్టాడు. చివరికి తెలిసింది: డిప్యూటీ కోపరేటివ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఒక గోపాలకృష్ణమూర్తిగారు రెండు నెలలు పని చేశాడని, పదిహేను రోజులక్రితం మళ్ళీ శ్రీకాకుళం ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోయాడనీని. వార్తతో ఇంటికి చేరాడు మూర్తి.

గుమ్మంలో అడుగుపెట్టగానే వెంకటప్పయ్య ప్రశ్నలవర్షం కురిపించసాగారు: "ఏమైంది? కనిపించాడా? వస్తానన్నాడా? ఇంటికే వెళ్లి కలుసుకున్నారా? భార్య ఏమంది?" అంటూ. మూర్తి మంచంమీద చతికిలబడి కాసేపు ఊరుకొని అన్నాడు: "ఆయన ఈ ఊళ్లో లేరండి" "మరి మొన్ననే కదా అతని పెద్దతండ్రి కొడుకు చెప్పాడు అతనీ ఊళ్లో పనిచేస్తున్నాడని" అన్నారు వెంకటప్పయ్యగారు. "అవునండీ. రెండు నెలలీ ఊళ్ళో పని చేశారట. కాని పదిహేను రోజులక్రితం ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోయారట" అని చెప్పాడు మూర్తి. వెంకటప్పయ్యగారు ఉస్సూరుమన్నారు. "ఇప్పుడేం దారి?" అన్నారు అర్ధస్వగతంలో. "వచ్చిందే దారి" అని కాంతం అనేసి మూర్తి తనకేసి చూడడం చూసి చటుక్కున నాలుక కరచుకుంది. రామం "ఎలాగా వచ్చాం కాబట్టి ఈ ఊళ్ళో రెండు సినిమాలేనా చూసిపోదాం. కొత్త ఊళ్లో సినిమాలు చూడడమంటే నాకు సరదా. నీకూ సరదాయే కదూ అక్కయ్యా. ఏమండీ మూర్తిగారూ, మమ్మల్ని మాటినీకి తీసుకువెళ్తారా. వీలైతే మొదటి ఆటకూడా చూసిరావచ్చు" అంటున్నాడు. కాని మూర్తి అతని మాటలు వినిపించుకోలేదు. అతి గారాబంతో పెరిగిన సంతానం అని స్పష్టంగా తెలుస్తోంది.

వీర్యస్తంభన రసాయనం : శుక్రనష్టము ఆపి మంచి బలం వీర్యవృద్ధి కల్గించును. వెల రూ. 5/-

గర్భ నిరోధిని: యిటు మీదట గర్భం రాకుండా ఆపుటకు, లోపలికి సేవించే అతి నమ్మకమైన మందు. రూ. 10/-

నపుంసక తైలం: చిన్నదైన అంగ నరములు, తిగ్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమునకు రూ. 10/-

పై వాటికి ఖర్చులు రూ. 1-0-0 లు అగును. కావలసినచో ముందుగా పంపేది.

డాక్టర్ రత్నం సన్స్, మెడికల్ హాల్, మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్.

★ పోస్టుమన్ చేసిన తమాషా ★

తండ్రి గారాబం చూపిస్తే చూపించవచ్చును కాని పైవాళ్లెక్కడ చూపించగలరు? కాంతం, రాముల మాటలూ, చేష్టలూ మూర్తికి కొంత అసహ్యం కలిగించాయి. అయినా వెంకటప్పయ్యగారిపట్ల జాలివల్ల ఏమీ అనకుండా ఊరుకున్నాడు. వెంకటప్పయ్యగారడిగారు "ఏం, బాబూ, ఏం చేయమంటారు మమ్మల్ని?" అని. మూర్తేం చెప్పగలడు? మాట్లాడకుండా కూర్చున్నాడు. "సరే రేపు ప్రొద్దున్నే బండికి వెళ్ళిపోతాం, బాబూ" అన్నారు వెంకటప్పయ్యగారు నిస్పృహతో. మూర్తి ఇన్నాళ్ళూ స్వేచ్ఛగా ఉంటున్నాడు. కాని వీళ్ళు వచ్చినప్పటినుంచీ క్షణం తీరిక లేదు. సరియైన తిండీ తిప్పలూ లేవు. తన ఇంట్లోనే తాను స్వేచ్ఛగా మసలడానికి వీలులేకపోతోంది. కాంతం, రాముల మాటలు మరీ చికాకు కలిగిస్తున్నాయి. వీళ్ళ నెంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిదనిపించింది. కాని వెంకటప్పయ్యగారి నిస్పృహ చూసి జాలిపడకుండా ఉండలేకపోయాడు. "పోనీ రానేవచ్చారు గదా. సంబంధమేదో చూసుకుపొండి. ఈ వేళలాగే ఒకటి రెండు రోజులుండి మీరు గడుపుకోగల్గితే నాకేమీ అభ్యంతరం లే"దన్నాడు. వెంకటప్పయ్యగారికి ప్రాణం లేచివచ్చినట్లైః "అదృష్టంవల్లే మీరు మాకు దొరికారు నాయనా. లేకపోతే ఎన్ని తిప్పలు పడవలసివచ్చునో. మీరు చుట్టాలు కాకపోయినా చుట్టాలే. ఎలాగో ఈ సంబంధం కుదిరితే మీ పేరు చెప్పుకుంటాను. —అయితే మీ రాయన నెరుగుదురా. కాలేజీలో ట్యూటరుట. పేరు సుందరరావట" అన్నారు.

"కాలేజీల్లో నే నెవరినీ అంతగా ఎరగనండీ. మెల్లగా కనుక్కుందాం" అన్నాడు మూర్తి.

"సరే నాయనా, నేనూళ్లోకి పోయి సంబంధంగూర్చి వివరాలు తెలుసుకువస్తాను —అన్నట్లు మీరింకా భోజనం చేయలేదు కదూ. ఈ గొడవలో ఆ మాటే మరచిపోయాం" అన్నారు వెంకటప్పయ్యగారు.

"భోజనం చేసేశానండి" అని చెప్పాడు మూర్తి.

"ఎక్కడ?"

"హోటల్లో"

"అదేమిటి మీ యింట్లో మీరు భోజనం చేయడానికేం? మా కోసమని మీరు హోటల్లో తినడ మెందుకు?"

"కాదులెండి. మళ్ళీ ఇంత దూరం రావడం బద్ధకంవేసి అలా చేశాను. అంతకన్నా ఏమీ లేదు."

"సరేకాని బాబూ, ఇందాకటినుంచీ అడుగుదా మనుకుంటున్నాను. మీవాళ్ళు పుట్టింటికి వెళ్లారా? - ఏమన్నా—"

"లేదండీ నా భార్య పోయి నాలుగేళ్ళయిందండీ"

వెంకటప్పయ్యగారు ఎగిరి గంతేసినంత పనిచేశారు. "పిల్లలున్నారా?" అని అడిగారు తేరుకున్నాక.

"లేరండీ"

"వయస్సు?"

"ముప్పై"

"అదేమిటి నాయనా, నాలుగేళ్లయి భార్యపోయి మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా ఉన్నావేం? ఇంకా చిన్నవాడివే. అనుభవించే వయస్సంతా ముందే ఉంది. సంబంధాలు నచ్చక చేసుకోలేదా?"

"అదేం కాదండీ. ఊరికేనే, మళ్ళీ పెళ్ళి చేసుకో బుద్ధివేయలేదంతే"నన్నాడు మూర్తి విషయం ఎలా మార్చడమా అని ఆలోచిస్తూ. కాంతం రామం మూర్తికేసి వింతగా చూశారు - ఇంత చిన్నవయస్సులోనే ఈయన కింతవైరాగ్యం కలిగిందేమా అని.

"మీరెంతమంది అన్నదమ్ములు?" అంటూ మళ్ళీ ప్రారంభించారు ఇన్వెస్టిగేషన్ వెంకటప్పయ్యగారు.

"ఇద్దరమండీ. నాకోక తమ్ముడున్నాడు. వాడికి పెళ్లయింది. ఒక పిల్లవాడుకూడా. మాకు నాలుగెకరాలభూమిఉంది. మా నాన్నగారే చూస్తున్నారు భూమిని. మా తమ్ముడు ఇంకొకఊళ్ళో మాష్టరీ చేస్తున్నాడ"ని మూర్తి వెంకటప్పయ్యగారు అడగగల ప్రశ్నలన్నిటికీ ముందే జవాబిచ్చివేశాడు.

"ఇంతకీ నీవు పెళ్లిచేసుకోకపోవడమే చాలా ఆశ్చర్యంగాఉంది నాయనా - సరే నేను ఊళ్లోకిపోయి ఈ సంబంధం విషయంలో కనుక్కునివస్తాన"ని గొడుగు తీసుకొని బయలుదేరారు వెంకటప్పయ్యగారు.

రామం మూర్తిదగ్గరకువచ్చి, "ఏమండీ మిమ్మల్ని మూర్తి మామయ్యా అని పిలవాలనిపిస్తోంది అలా పిలవనా?" అన్నాడు.

"నీయిష్టం" అని నవ్వాడు మూర్తి.

"సరే మూర్తి మామయ్యా, మరి మమల్ని మాటెనీకి తీసుకువెళ్లడంమా టేంజేశారు? ఇక్కడేంతోచడంలేద"న్నాడు రామం.

"ఏ కే సినిమాలు ఇష్టం" అని అడిగాడు మూర్తి.

"మా అక్కకు ఇంగ్లీషుసినిమాలంటే ఇష్టముంటుంది - ఇంటర్ మీడియెట్ చదివింది కాబట్టి. హిందీ సినిమాలుకూడా ఇష్టమే - ముఖ్యంగా దిలీప్‌కుమార్ ఉన్నవి -" అంటూ అక్కగారికేసి నవ్వుతూ చూశాడు రామం. "నాకు తెలుగుసినిమాలంటే నే ఇష్టం. హిందీ, ఇంగ్లీషునైనా ఇష్టమే. అసలు ఏదో సినిమా చూడాలి అంతే," నన్నాడు రామం.

"ఊళ్లో 'శోవాడిస్' ఆడుతోంది దానికి తీసుకువెళ్తాను. తయారవండి" అన్నాడు మూర్తి. రామం వేషం వేసేశాడు. కాంతం అప్సరసలా తయారయింది. మూర్తి మామూలుగానే బయలుదేరాడు. "మీరు

పగులగొట్టుచున్న తలనొప్పియా?

సారిడన్ ను పుచ్చుకోండి

ఇప్పుడు క్రొత్త, ఆరోగ్య రక్షకమైన అభ్రకపు కాగితప్యాకింగులో దొరకును
ఒక బిళ్ల 2 అణాలు.
నొప్పిని పోగొట్టును-విశ్రాంతి నిచ్చును నవోత్సాహము చేకూర్చును.

అబలసుధ

స్త్రీ కుసుమవ్యాధులు, అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ, కాళ్లు లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును.
సీసా రు. 3/- వి. పి. రు. 1/-
ఇండియన్ మెడిసన్ హౌస్
లక్ష్మీ టాకీసు రోడ్డు - విజయవాడ-2.)

దుస్తులు మార్చుకోరూ" అంది కాంతం. "నా వేషం ఇంతే"నంటూ ముందుకు సాగాడు మూర్తి. "వైరాగ్యం చాలా ముదిరిందే" అనుకున్నారు కాంతం, రాముడూను. సినిమా హాలుదగ్గరకు వెళ్ళినతర్వాత కాంతానికి జ్ఞాపకం వచ్చింది పాపం ఈ మూర్తిగారు చుట్టం కాకపోయినా ఈయన నెత్తినెక్కింది చాలక ఇలా సినిమాలకు కూడా తీసుకువెళ్లమనడం బాగుండదని. రామాన్ని అడిగింది "ఏరా, నాన్న దగ్గర డబ్బులు పుచ్చుకున్నావా?" అని. దీనికన్నాడు రాముం. "దీనికేమిటి నీకు త్రి సినిమాటికెట్లకి కావద్దూ" అంటూంటే మూర్తి "అదేమిటి, మీరు టికెట్లు కొనడమేమిటి, మీరు నా అతిథులు గౌరవించవలసినబాధ్యత నాది. నేను పట్టుకువస్తానుండండి" అని టికెట్లు తేవడానికివెళ్లాడు. కాంతం రామం బాగానే ఉందనుకున్నారు కాని ఇంత వైరాగ్యం ముదిరిన మనిషి ఏ థర్డ్ క్లాసుకో తీసుకుపోతాడేమోనని భయపడ్డారు. కాని మూర్తి ఫస్ట్ క్లాస్ టికెట్లే పట్టుకువచ్చాడు. ఆట మధ్యలో కూల్ డ్రింక్స్ కూడా ఇప్పించాడు. "నీవు చాలా మంచివాడివి, మూర్తిమామయ్యా" అన్నాడు రాముం. సినిమాలో కాంతానికి కావలసిన రొమాంటిక్ దృశ్యాలూ, రామానికి కావలసిన స్టంటు దృశ్యాలూ కావలసినన్ని ఉన్నాయి. చాలా ఉత్సాహంగా ఉన్నారిద్దరూ. సినిమానుంచి వచ్చేటప్పుడుకూడా అదృశ్యాలే తలచుకుంటూ ఉల్లాసంగా కబుర్లు చెప్పుకోసాగారు. ఉన్నట్లుండి కాంతం మూర్తికేసిచూసి "బహుశా మూర్తి మామయ్యగారి కిలాంటివేమీ రుచించవనుకుంటాను" అంది నవ్వుతూ. "వైరాగ్యం కాబట్టి కాదూ? అన్నాడు మూర్తి నవ్వుతూనే. దారిలో వాళ్లకు ఆఊళ్లో చూడవలసినవిచూపించి వాటినిగురించి చెప్పాడు.

వాళ్లు ఇంటికిచేరేసరికి వెంకటప్పయ్యగారుకూడా తిరిగివచ్చారు. సంబంధం విషయంలో అన్నీ తెలుసుకున్నామన్నారు. వరుణ్ణికూడా చూశామన్నారు. తనకన్నివిధాలా సంబంధం నచ్చిందన్నారు. ఆయన ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. కాంతం వంటచేసింది. భోజనాలు చేశారు. వెంకటప్పయ్యగారు ఇక ఆ వరుడు కాంతానికి కనిపించేటట్లు చేయడానికి పథకం ఆలోచించసాగారు. మూర్తిని కూడా సలహా అడిగారు. మూర్తికేమీ తట్టలేదు. ఎంతసేపాలోచించినా సరియైన పథకం తయారుకాలేదు. పథకం ఆలోచిస్తూనే నిద్రవచ్చి గుర్రుపెట్టసాగారు ఆయన. మూర్తి బయటికి పోబోతూంటే కాంతం వంటింటిపని పూర్తిచేసుకొని వచ్చింది. "ఏమండీ, మీదగ్గర ఏదైనా మంచిపుస్తకాలుంటే ఇచ్చిపొండి కాసేపు చదువుకుంటానంది." మూర్తి తన పుస్తకాల బీరువా తీసి చూపించాడు. రాముం పుస్తకాలన్నీ తీసి అక్కగారికి చూపిస్తున్నాడు. బీరువాలో రకరకాల నవలలూ, కథల పుస్తకాలూ, ఇతర పుస్తకాలూ, మేగజీన్లూ-సినిమా పత్రికలుకూడా ఉన్నాయి. అవన్నీ చూసి కాంతం నవ్వుతూ అంది: ఇదేమిటి, ఇంత వైరాగ్యం ఉన్నవారికి ఈ పుస్తకాలన్నీ ఎందుకు?" మూర్తి మాట్లాడలేదు. "అయితే వైరాగ్యంవల్ల కాదన్నమాట ఇన్నాళ్ళూ పెళ్లిచేసుకోనిది, ఇంకోకారణమయి ఉంటుంది. ఆ కారణమేమిటో కూడా నాకు తెలుసులెండి" అంది. "ఏమిటి చెప్పండి చూదాం" అన్నాడు కుతూహలంతో. "ఏ సినిమా తారలాంటి అమ్మాయో కావాలని చూస్తున్నారు. మీరు వచ్చిన సంబంధాలలో అటువంటివారు కనిపించి ఉండరు," అని తన అభిప్రాయం చెప్పింది కాంతం. మూర్తి నవ్వాడు: "ఊహు కనుక్కోలేకపోయారు, అదికాక సినిమా తారల్లాంటివారు నాలాంటివాణ్ణి పెళ్లిచేసుకుంటారా."

"ఎందుకు చేసుకోరూ?- చేసుకు నేవాళ్ళుంటేవచ్చు."

"పోనీ మీరు చేసుకోగలరా?"-

"ఏం సమాధానం వస్తుందో మీరు గ్రహించగలరనుకుంటాను" అంది కాంతం నిర్లక్ష్యంగా.

రామం అన్నాడు: "మూర్తి మామయ్యా నా అక్కను పెళ్లాడ దలచినవాడికి ఏం క్వాలిఫికేషన్సు కావాలో చెప్పనా" అంటూ కాంతం నోరు నొక్కుతున్నా చేతితో ఆమె చేయితీసి చెప్పటం మొదలు పెట్టాడు: "ఇరవై రెండేళ్లు దాటగూడదు, రెండో పెళ్ళివాడు కాకూడదు. అందగాడై ఉండాలి. దిలీప్‌కుమార్ పోలిక ఉండాలన్నమాట. ఎం. బి. బి. ఎస్. లేక బి. ఇ అయితే ఫస్ట్ ప్రిఫరెన్సు. ఎం. ఏ. ఎం.ఎస్‌సి అయితే సెకండు ప్రిఫరెన్సు. మంచి ఆస్తి ఉండాలి, మేడ, కారూ వగైరాలుండాలి, టెన్నిస్ ఆటకాడై ఉండాలి—" కాంతం నోరు మూసేసింది.

మూర్తి నవ్వుతూ "బాగుంది క్వాలిఫికేషన్స జాబితా. మరి నా క్వాలిఫికేషన్ చెప్పనా: వయస్సు ముప్పై, మొదటిభార్య పోయింది. తుమ్మచెక్క రంగు (!) ఆస్తి పాలుగొకరాలే. పల్లెటూర్లో పెంకుటిల్లు. కారు కాదుగదా సైకిలుకూడా లేదు. టెన్నిస్ మాట అటుంచి పేకాటేనారాదు. పైగా వైరాగ్యంకూడా" అంటూ తన్ను తానే వికృతంగా వర్ణించుకున్నందుకు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. మళ్ళీ ఒక సత్రపు అరుగుమీదచేరి నడుం వాల్చాడు.

మర్నాడు పొద్దున్న అతను ఇంట్లో అడుగుపెట్టగానే కాంతం అడిగింది: "ఏమండీ, మీరు పెళ్ళిచేసుకోకపోవడానికి కారణం చెప్పనా" అని. "చెప్పండి" అన్నాడు మూర్తి విందామనే కుతూహలంతో. "మీకు స్త్రీలమీద ద్వేషంవల్ల కాదూ?" అని అడిగింది కాంతం. ఈసారి మూర్తి నవ్వలేదు. కొద్దిగా సందేహిస్తున్నట్లుగా అన్నాడు: "ద్వేషం అనడంకంటే భయం అంటే బాగుంటుందేమో." కాంతం నవ్వింది: "స్త్రీజాతి అంత భయంకరమైనదని నిర్ణయానికి వచ్చారన్నమాట!" మూర్తి ఏమీ మాట్లాడలేదు. "ఎవరో ఒక స్త్రీవల్ల ఒక అనుభవం కలిగిందని మొత్తం స్త్రీజాతినే ఈవిధంగా భావిస్తే అది నిజంగా అన్యాయం అంటాను. నేనూ స్త్రీనే కాబట్టి మాపట్ల మీకిలాంటి అభిప్రాయాలు కలిగినందుకు ఎంతో విచారిస్తాను" అంది కొంచెం ఉద్వేగంతో. "నా విషయంలో మీ కెందుకింత అనవసర శ్రద్ధ? నేను పెళ్లికోసమేమీ ఆతృతపడడం లేదు. ఆ విషయంలో ఎవరి సలహా కోరను, అక్కర్లేదు కూడా. ముందు మీ విషయం ఆలోచించుకోండి. వచ్చిందే అందుకు," అంటూ దొడ్లోకి చక్కాపోయాడు మూర్తి. అతను స్నానంచేసుకొని వచ్చినవెంటనే వెంకటప్పయ్యగారు అతనిదగ్గరకు వచ్చి ఏదో పెద్ద సమస్యను పరిష్కరిస్తున్నట్లుగా మొగం పెట్టి: "ఇంకా సరియైన పథకం

ఒక గంటలో యౌవ్వనము
కామస్తంభన
ధాతుపుష్టి, వంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. విరాకచెందిన వృద్ధులయందు శక్తి ఉత్సాహము నిచ్చును, రు. 2-8-0.
మదనమంజరి ఫార్మసీ
184, వైనాబజారు రోడ్డు. మద్రాసు-1.
బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు-పార్కురోడ్
రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్
వెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-టంకురోడ్
ఇతర కేంద్రాలలో ఏజెంట్లుకావాలి

అకాలనెరసి బట్టను ఆపుటకు
కాశ్మీర్-కుసుం
మీ ఇష్టమైన సూనెలో నానవేసి
యునైటెడ్ కెమికల్ సర్వీస్, బందరు వీధి, మద్రాసు-4. విజయవాడ.
చర్మ ఉపద్రవములకు, అపాయములకు అత్యున్నతమైన సుగంధ మలాము
సాంతలక్స
గజ్జి, పుండ్లు, కాటులు మొటిమలు

★ పోస్టుమన్ చేసిన తమాషా ★

తట్టలేదోయి. బహుశా సాయంత్రానికేనా ఆలోచించగలననుకుంటాను. కాని ఈ లోపుగా ఒకసారి ఆ వరుణ్ణి నీకు చూపిస్తాను వస్తావా" అన్నారు. అలాగే బయలుదేరాడు మూర్తి.

వెంకటప్పయ్యగారు మూర్తిని అవరుడు సుందరరావు, ఇంటివైపుకు తీసుకు వెళ్ళారు. సుందరరావు ఇంటి ఎదురుగుండానే ఒక హోటలుంది. ఇద్దరూ ఆ హోటలులోకి వెళ్ళి కాఫీ త్రాగుతూ సుందరరావు ఇంటికేసీ చూడసాగారు సి.ఐ.డి లలా. కాసేపటికి సుందరరావు ఇవతలికి వచ్చి తనకోసం వచ్చిన మిత్రులిద్దరితో ఏమో మాట్లాడి లోపలికి తీసుకువెళ్ళాడు. వెంకటప్పయ్యగారు మూర్తికి అతనిని చూపించి గుర్తు పెట్టుకోమన్నారు. "సాయంత్రానికి మా కాంతానికి అతను కనిపించేటట్లు చేసే ఏర్పాట్లు చేస్తాను. అప్పుడు వీలునుబట్టి నీవు కానీ, నేను కానీ కాంతానికి అతనిని చూపిద్దాం. అందుకే నిన్ను ఇప్పుడు తీసుకు వచ్చా" నన్నారు ఆయన. ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు.

సాయంత్రం మూర్తికి ఎదురుగా పరుగెత్తుకువచ్చారు వెంకటప్పయ్యగారు "తెలుసుకున్నానోయి. ఈవేళ రాత్రి అతను తన స్నేహితులతోబాటు సినిమాకు వెళ్తాడట. ఒకరివల్ల తెలుసుకున్నాను. కాంతాన్ని సినిమాకు తీసుకువెళ్తే అతను తప్పక కనిపిస్తాడు" అన్నారు. మూర్తికి చిరునవ్వు రాకుండా ఉండలేకపోయింది. ఆ సుందరరావుమీద ఈయన డిటెక్టివ్ గా పనిచేస్తున్నందుకు. చిరునవ్వు కప్పిపుచ్చబోయాడు కాని వెంకటప్పయ్యగారు చూడనే చూశారు. అన్నారు: "నీకు నవ్వు వస్తోంది కదూ, నాయనా - నేనిలా అవస్థపడుతున్నందుకు. అవును నీకు నవ్వుగానే ఉంటుంది నాయనా. మరేం చేయను? మగవాడు ఎన్ని సంబంధాలు తోసివేసినా పరవాలేదు. పైపెచ్చు అతనిలో ఏదో విశేషముంటుందనే భ్రమ కూడ కలిగి కట్నాల మార్కెట్టులో అతని విలువ పెరగవచ్చు కూడా. కాని ఆడదే అలా చేస్తే మళ్ళీ ఒక్క సంబంధం రాదనుకో. అందుకే ఈ తిప్పలన్నీని." ఇద్దరూ లోపలికి వచ్చారు. "సరే, ఏ సినిమాకు వెళ్తాడో కూడా తెలుసుకువచ్చారా" అని అడిగాడు మూర్తి. "నిన్న మీరు చూసివచ్చిందే. 'కోవాడిసే' నట. నువ్వు తీసుకువెళ్ళి రావాలి" అన్నారు ఆయన. మూర్తి పెద్ద నిట్టూర్పు విడుస్తూ "చచ్చాం, మళ్ళీ అదే సినిమాకా! నిన్ననే తలనొప్పి వచ్చిందే. అందులోనూ నాకు వైరాగ్యంకూడా ఎక్కువ" అంటూ కాంతం వైపు తిరిగి నవ్వాడు. "మీరే తీసుకువెళ్లండి" అన్నాడు. "కాదు, కాదు నాయనా. నాకు కళ్ళజబ్బుంది. సినిమా చూసే ఆపైన చాలా బాధపడవలసివస్తుంది. నీవే తీసుకువెళ్ళిరా, నాయనా. నాకోసం యీమాత్రం కష్టం తీసుకో నాయనా. అది చూసి సరే అంది అంటే రేపుప్రొద్దున్నే వారింటికి పోయి సంబంధం విషయం తేల్చివేసుకుంటాను. రేపు సాయంత్రమే ఇంటికి ప్రయాణం. దానితో నీకు మా భారం తొలగిపోతుంది. ఈ సంబంధం కుదిరితే నీవల్లేనని చెప్పుకుంటాను" అంటూ మూర్తి చేతులు పట్టుకోబోయారు. కాని మూర్తి "అయ్యో దీనికింత చెప్పాలా. అలాగే తీసుకువెళ్తానులెండి. ముందు భోజనం చేసి వెళ్తే బాగుంటుందనుకుంటాను" అన్నాడు. అలాగే అందరూ పెందరాళే భోజనం చేశారు. మూర్తి, కాంతం, రామం సినిమాకు బయలుదేరారు.

మూర్తి మళ్ళీ ఫస్ట్ క్లాస్ టికెట్లే కొన్నాడు. 'ఎక్సిట్' దగ్గర కుర్చీల్లోనే కూర్చున్నారు. ఎందుకంటే ఎవరు వచ్చినా వారి ముందునుంచే వెళ్లవలసి ఉంటుంది. అలాగే కొంతసేపటికి సుందరరావు తన స్నేహితులతో వచ్చి మూర్తివాళ్ల ముందరే కొంతసేపాగి, ఎక్కడ సీట్లు బాగా ఉంటాయో చూసుకొని, వాళ్లకు ప్రక్కన కొద్దిదూరంలో కూర్చున్నాడు. మూర్తి సైగచేసి కాంతానికిసుందరరావును చూపించాడు. కాంతం సుందరరావు కేసి ఒక్క రెండు క్షణాలు చూసి మొగం తిప్పివేసుకుంది. మూర్తి ఇంకా అతనికేసే చూపించసాగాడు కాని కాంతం అటు చూడనేలేదు మళ్ళీ. మూర్తి వెంటనే గ్రహించాడు ఆ సుందరరావు కాంతం పరీక్షలో తప్పిపోయాడని. కాని కాంతాన్ని కొంచెంసేపు ఉడికించాలనే ఉద్దేశ్యంతో "అడుగో వాళ్లతో మాట్లాడుతున్నాడు. ఆఁ ఆఁ నిలబడుతున్నాడు, అదే ఇటే చూస్తున్నాడే" అంటూ వ్యాఖ్యానం సాగించాడు. ఆఖరికి ఇంటర్వెల్ కు కాంతం లేచి ఇంటికి వెళ్ళిపోదామంది. ఉండమన్నాడు మూర్తి. ఉండనంది కాంతం. మూర్తికి అసలు అంతకన్న ఉండాలని లేదు. అందువల్ల వెంటనే లేచాడు. రామానికి కదల బుద్ధివేయలేదు. అక్కడను ఉండమని బ్రతిమాలాడు కాని ఎవరూ తనమాట వినకపోయేసరికి మూలుగుతుంటూనే అతనూ వచ్చివేయవలసి వచ్చింది. దారిలో మూర్తి స్నేహితుడొకడు కనబడి "ఏరా, మూర్తీ, రాత్రిళ్లు సత్రపు అరుగుమీద–" అంటూంటేనే మూర్తి మూతిమీద వేలువేసుకొని తన స్నేహితుణ్ణి ప్రక్కకు లాగుకుపోయాడు. "గట్టిగా అనకురా. మా యింటికి చుట్టాలువచ్చారు. అందరికీ ఇల్లుచాలదని అక్కడకు పోయి పడుకుంటున్నాను అంతే" నన్నాడు. "పోనీ మాలో ఎవరో ఒకరిఇళ్లకు రాకూడదూ!" అని ప్రశ్నించాడు ఆ స్నేహితుడు. "మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టడమెందుకని అలా చేశాను" అని మూర్తి చెప్పగా "స్నేహితులుండి ఎందుకురా. ఈ రాత్రి సత్రపు అరుగు చేరావో ఊరుకోను తెలుసా. మా యింటికిరా. నీకు ప్రక్క వేసి ఉంచుతాను" అని చెప్పి ఆ స్నేహితుడు వెళ్లిపోయాడు. కాని కాంతం మొదట్లో ఆ సన్నమాటలు వింది కాబట్టి మూర్తి దగ్గరకు రాగానే అంది "అయితే నిన్న, మొన్న ఎవరో స్నేహితులిళ్లకు వెళ్తాము అని చెప్పి సత్రపు అరుగుమీద పడుకున్నారా. ఈవేళనుంచి అలా చేయడానికి వీలులేదు. మాకోసం మీరు ఇబ్బంది పడడానికి నేనొప్పుకోను. ఈ రాత్రి మీకూ మా నాన్నకూ ఎదరగదిలో పక్క వేస్తాను. నేనూ, మా రామం లోపల వంటగదిలో పడుకుంటాము" "అలాగే చేద్దురుగాని లెండి" అన్నాడు మూర్తి. ముగ్గురూ ఇంటికి చేరారు.

వెంకటప్పయ్యగారు నిద్రపోకుండా వాళ్ళకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. కూతురు వస్తుంది, వచ్చాడని చెపుతుంది, మర్నాడే పెళ్ళిమాటలు మాట్లాడాలి అనే ఉత్సాహంతో ఉన్నాడాయన. "ఏం, అమ్మాయి అతన్ని చూసిందా, నాయనా" అని ప్రశ్నించారు మూర్తిని. "ఆ, చూసిందండీ" అన్నాడతను. "ఎలా ఉన్నాడంది" అని అడిగారు, "మీరే అడగండి" అన్నాడు మూర్తి. "ఏమే అమ్మాయీ, ఎలా ఉన్నాడు, నచ్చాడా?" అని అడిగారు కూతుర్ని. కాని కాంతం మాట్లాడలేదు. వెంకటప్పయ్యగారు కూతురిచేత ఊ అనిపించాలనే ఆత్రంతో "బాగా ఉన్నాడు కదూ" అన్నారు. "ఆఁ, బాగానే

కుష్ఠం ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము. సలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము."

గోపాలపురం. తూర్పుగోదావరి.

ఉన్నాడు – ఎత్తుపళ్ళూ, పిల్లికళ్ళూ, రాగిజుట్టూ–" అంటూ ముక్కు ముడుచుకుంది కాంతం. వెంకటప్పయ్యగారు నోరు తెరచుకొని అలాగే ఉండిపోయారు ప్రతిమలా. మూర్తి కాంతానికి సుందరరావు నచ్చలేదని ఇదివరకే గ్రహించాడు. కాని, ఆమె ఇంతలా వర్ణిస్తుందనీ, ఇంతలా అసహ్యించుకుంటుందనీ ఊహించలేకపోయాడు. అతను గుర్తించనేలేదు సుందరరావుకు ఎత్తుపళ్ళూ, పిల్లికళ్ళూ, రాగిజుట్టూ మొదలైనవి ఉన్నాయని. కాంతం ఇట్టే పరీక్షించివేసింది. కాంతం చెప్పినతర్వాత సుందరరావుకు అవి అన్నీ ఉన్నట్లు జ్ఞాపకం వచ్చింది అతనికి. వీరిద్దరూ ఇలా ఆశ్చర్యంలో మునిగిపోయి ఉండగా రామం ముందుకు వచ్చి "అక్కయ్యా, పురాణ వ్యక్తు"ల్ని చాలామందిని గుర్తుపట్టావు నీవు. కాని కిష్కింధాపుర ప్రముఖులందరినీ చూపించలేదు నీవు. ఈ సుందరరావుగారిని కూడా వారిలో –" అంటూంటే వెంకటప్పయ్యగారు "నువ్వు నోరు మూసుకు కూర్చో, వెధవా" అంటూ విరుచుకుపడ్డారు. తండ్రికోపం చూసి చల్లగా వెనక్కి తప్పుకున్నాడు రామం. వెంకటప్పయ్యగారు తీవ్రంగా అన్నారు: ఏమైనా సరే ఇదే నేను చూసే ఆఖరి సంబంధం. చేసుకుంటే ఇదే లేకపోతే మరొకటి నేను చూడను." కాంతం తల ఎత్తకుండా బింకంగానే అంది: "నేనీ సంబంధం చచ్చినా చేసుకోను." ఆ సమాధానం విని వెంకటప్పయ్యగారు ఆగ్రహావేశంతో కొంతసేపు మాట్లాడలేకపోయారు. గుడ్లతో మింగేటట్లు చూడసాగారు. కొంతసేపటికి కొంత కోపం అణచుకొని అన్నారు: "ఇంతకన్న మంచి సంబంధం ఎక్కడ దొరుకుతుంది? ఏం, నాయనా, నీ వేమంటావు?" అని మూర్తివైపుకు తిరిగి ప్రశ్నించారు. మూర్తి కొంచెంసేపు ఆలోచించి, ఒకసారి కాంతంవైపుచూసి మెల్లగా అన్నాడు: "ఏమో, నాకు ఈ సంబంధం బాగానే ఉన్నట్లు తోస్తోంది. మిగిలిన అన్నివిషయాలూ మీ అమ్మాయి కోరినట్లుగానే ఉన్నాయికదా. అందంలోమాత్రం నాకేమంత అనాకారిగా కనిపించలేదు. కొంచెం పళ్లుఎత్తుఉన్నా, కళ్ళు తేలికరంగుగాఉన్నా అంత వికృతంగా ఏమీ కనిపించడంలేదే. అసలు ఏలోటూలేని మనిషెవడుంటాడు" మూర్తి తండ్రిని సమర్థించడంచూసి కాంతం పెదవి కొరుకుకుంటూ చేతిలో మేగజైను కాగితాలు విసురుగా తిరగవేస్తోంది. మూర్తి మాటలు విని వెంకటప్పయ్యగారు ఆనందంతో పొంగిపోతూ "బాగా చెప్పావు నాయనా. నిక్షేపంలా ఉన్నవాడికికూడా వంకలా? దీనివరసచూస్తే ఆఖరికి ఇంద్రుడికి కూడా వేలువంకలు పెట్టేటట్లుంది. అందం ఉండీ, అన్నీ ఉన్నవాడు పదివేలకు తక్కువ తీసుకుంటాడా. ప్రతిదానికీ రాజకుమారుడు కావాలని ఉంటుంది. కాని జరగవద్దూ" అన్నారు. కాంతం కనుబొమలు చిట్లించుకొని అలాగే కూర్చుంది. మూర్తి కాంతంకేసి తిరిగి "పోనీ మీకు పెళ్ళి చేసుకోవాలని లేదా చెప్పండి. చదువు చదివి ఏఉద్యోగమేనా చేయాలనిఉంటే అలా చెప్పండి. అప్పుడు మీ నాన్నగారు బాధపడవలసినపనే ఉండదు" అన్నాడు. వెంకటప్పయ్యగారు కాంతం మాట్లాడకముందే కూతురు తనమాట కాదంటోందన్నకోపంతో వెటకారంగా అన్నారు. "ఆ, ఉద్యోగం చేస్తుంది ఉద్యోగం! ఇంటర్ మీడియేట్ చదవడమే గగనమైతే. రెండుసార్లు పరీక్షకు వెళ్లి వచ్చి పెడి తెలుగు పాసయింది. ఇక ఈవిడ పెద్ద చదువులు చదువుతుందీ –

ఉద్యోగం చేస్తుందీను!" రామం మళ్ళీ ముందుకు వచ్చాడు: "అది కాదులే నాన్నా. అక్కయ్య నా కోసమని ఆగిందిలే. పాసవలేక కాదు. నేనూ అక్కయ్యా ఒక్కసారే ఇంటర్ మీడియేట్ పాసవుతాంలే" అంటూండగానే కాంతం కోపం పట్టలేక "మహా నువ్వే తెలివిగలవాడవు లేవోయ్" అంటూ జుట్టుపట్టుకొని రామాన్ని వెనక్కి లాగేసింది. వెంకటప్పయ్యగారు మూర్తితో అన్నారు" "పోనీ అందగాడి నే చూసి పెళ్ళి చేసుకోమంటే కేవలం అందం చాలదట. బి. ఇఓ, ఎం. బి. బి ఎస్సో కావాలట. ఆస్తి కావాలట. ఈ గొంతెమ్మకోర్కెలకేమన్నా అర్థం ఉందా అని. దీనిపైవాళ్ళిద్దరూ ఇలాంటివేమీ కోరలేదు. నేను చేసినట్లు చేసుకున్నారు. సుఖంగా సంసారాలు చేస్తున్నారు. ఇక ఇలా కాదు. రేపు పొద్దున్నే వెళ్ళి వాళ్ళతో మాట్లాడి వస్తాను. వాళ్ళు తప్పక సుముఖంగా ఉంటారని నా పూర్తి నమ్మకం." మూర్తి "అలా చేస్తేనే బాగుంటుందిలెండి. చిన్నవాళ్లు ఒక్కొక్కప్పుడు అర్థంలేని ఎన్నడూ నెరవేరని ఆశలు పెట్టుకుంటారు. అటువంటప్పుడు వాళ్ళను సరియైనదారిలో పెట్టడం న్యాయమే లెండి" అన్నాడు పెద్దమనిషి తరహాగా. కాంతం ఈ వాదాన్ని త్రోసి పారేసేందుకన్నట్లుగా "నేనీసంబంధం చేసుకోను, చేసుకోను" అంది గట్టిగా. వెంకటప్పయ్యగారు మళ్ళీ నిలువెత్తున లేచారు. "చేసుకోవు! చేసుకోవు! చేసుకోక ఏంజేస్తావో చూస్తానుగా" అని అరిచారు. కాంతం అక్కడ ఉండలేక వడివడిగాపోయి మంచంమీద బోరగిలపడి మొగం తలగడలో దాచుకుంది. మూర్తి బయటికిపోవడానికి లేచాడు. కాంతం కదలలేదు. మూర్తి బయటికివచ్చి స్నేహితుడింటికి వెళ్లిపోయాడు.

పొద్దున్న ఇంటికి వచ్చాడు. కాంతం మాత్రం లేవలేదు. మూర్తి స్నానాది కృత్యాలు పూర్తిచేసుకొని ఏదో పుస్తకం చదువుకోసాగాడు. అప్పటికీ కాంతం లేవలేదు. ఇలాగే కూర్చుంటే వేళకు నోట్లో

నాగసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

మెతుకులుపడవని గ్రహించి రామాన్ని పిలిచి "రావోయ్ రామం మనమిద్దరమే వంట చేదాం, మరేంజేస్తాం?" అంటూ వంటింటిలోకి దారితీశాడు. కాంతం ఒక్కసారిగా జేవురించిన మొగంతో విసురుగా వచ్చి "మీరిక్కడనుంచి వడవండి" అని చెప్పి స్నానం చేసివచ్చి వంట మొదలుపెట్టింది, బ్రతికాంరా బాబూ అనుకుంటూ మూర్తి ఒకమారు స్నేహితుని యింటికి పోదామని బయలుదేరాడు. వెంకటప్పయ్యగారు దొడ్లో ఎండలో కూర్చొని భగవద్గీత పఠిస్తున్నారు.

మూర్తి వెళ్లిన మరికొంతసేపటికి అతని తండ్రి రాఘవయ్యగారు రైలునుంచి దిగారు. సరాసరి కొడుకు ఇంటికి నడచి వచ్చారు. తిన్నగా లోపలికి ప్రవేశించారు. రామం మంచంమీద పడుకొని ఏదో బొమ్మల మేగజైను చూస్తున్నాడు. కాంతం వంటింట్లో తిరుగుతోంది. ఎవరూ రాఘవయ్యగారి రాకను గమనించలేదు. రాఘవయ్యగారు కొడుకు యింట్లో కొత్త వాళ్లని చూసి కంగారుగా వెనక్కి వీథిలోకి పరుగెత్తారు. "ఇదేమిటి పీ డిల్లు మారాడా ఏమిటి చెప్పా! ఉత్తరమేనా రాశాడు కాదు" అనుకున్నారు. ఒకరిద్దరిని అడిగారు మూర్తి ఎక్కడకు మారాడని. "ఎక్కడకూ మారలేదు. పాత ఇంట్లోనే ఉంటున్నారే" అన్నారు వాళ్లు. రాఘవయ్యగారు ఏమీ అర్థంకాక సందేహిస్తూనే మెల్లగా ఇంటిగుమ్మం మెట్లెక్కసాగారు. కాంతాన్ని చూసి మళ్ళీ గడపదగ్గర ఆగిపోయారు. కాంతం ఆయన్ని చూసి "ఎవరి కోసం వచ్చారు" అని అడిగింది. "గోపాలకృష్ణమూర్తి-" అంటూ అస్పష్టంగా అన్నారాయన. "ఇప్పుడే ఎక్కడికో వెళ్ళారండి కాసేపటిలో వస్తారు. మీరు కూర్చుంటారా, మళ్ళీ వస్తారా" అని అడిగింది కాంతం స్పష్టంగా చదువుకున్నది కాబట్టి. రాఘవయ్యగారి మనస్సులో క్షణంలోనే వేయి అనుమానాలు బయలుదేరాయి. "ఎవరీమె? తన కొడుకు ఇంట్లో ఎందుకుంది? ఇంత ధాటీగా జవాబు చెప్తోంది" అని ఆశ్చర్యంతో అనుమానంతో మాట్లాడలేక వెనక్కి తిరిగారు. మూర్తి కనుపించాడు. ఆయన ఆశ్చర్యంనుంచి తేరుకొని అతన్ని అడిగేలోగానే మూర్తి "ఎప్పుడొచ్చావు, నాన్నా" అంటూ లోపలికి నడిచి వెంకటప్పయ్యగారిని పిలిచి ఆయనను గురించి చెప్పాడు. రాఘవయ్యగారి గుండె తేలికయింది. ఎంత పొరబాటువును! అదృష్టవశాత్తూ నాలుక జారలేదు కాని!" అనుకున్నారు. వెంకటప్పయ్యగారు "మీరు రావడం చాలా సంతోషం కలిగించింది. మీ అబ్బాయి మాకు దేవుడిలా దొరికాడు. చుట్టాలకన్న ఎక్కువ తోడ్పడుతున్నాడు. లేకపోతే మేమెన్ని ఇబ్బందులు పడవలసి వచ్చునో—ఇంతకీ మీరు వచ్చినపని?" అని ప్రశ్న వేశారు. "ఏముందండీ, వీడి భార్యపోయి నాలుగేళ్లయింది. అది బ్రతికున్నాళ్లూ తను సుఖపడలేదు, వాడినీ సుఖపెట్టలేదు. ఆ అనుభవంతో వీడు మళ్లీ పెళ్ళే చేసుకోనంటున్నాడు. ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. ఎన్ని వచ్చినా ఒప్పుకోవడంలేదు. కాని వాడిలా ఉండిపోతే మేమెలా ఊరుకోగలమండీ. దిగులుతో తల్లడిలిపోతున్నాం, ఎలాగో వాణ్ని ఒప్పించి పెళ్లిచేద్దామని వచ్చానండి" అని చెప్పారు రాఘవయ్యగారు. ఇంకేముంది, ఇద్దరూ ఒకేస్థితిలో ఉన్నారు; ఒకరి కష్టసుఖాలొకరు చెప్పుకుని పదినిమిషాలలో ప్రాణస్నేహితులయిపోయారు వెంకటప్పయ్యగారూ, రాఘవయ్యగారూను.

భోజనాలదగ్గర వెంకటప్పయ్యగారు మూర్తిని ప్రశ్నించారు "ఏం నాయనా, మూర్తీ. మీ నాన్నగారు వచ్చారు. మరి ఏమంటావు? మీ నాన్నగారు చెప్పిన సంబంధం నా దృష్టిలో అన్నివిధాలా బాగానే ఉన్నట్లుంది. దానికి నీ అభ్యంతరమేమిటి?" "ఏమీ లేదండి. పెళ్లి చేసుకోదలచలేదంతే" నన్నాడు మూర్తి. కాంతానికి మూర్తిమీద తిరుగుదెబ్బ కొట్టడానికి అవకాశం కనిపించింది. "నా విషయంలో ఇంతకుముందు ఏవేవో చెప్పారే. ఇప్పుడు మీ విషయంలో ఏం చెప్తారు?" అని అడిగింది. "నేను సంబంధం విషయం కాదు, చెపుతున్నది. పెళ్లి చేసుకోవడమే వస్తే ఈ సంబంధమే చేసుకోవచ్చు. ఇదే కాదు మరే సంబంధమైనా మా అమ్మకీ, నాన్నకీ నచ్చి చేసుకోమంటే చేసుకుంటాను. కాని నాకు అసలు వివాహం చేసుకోవాలనే ఉత్సాహం లేదని నేను చెపుతున్నాను" అన్నాడు మూర్తి బాధతో ఏవో వెనకటి అనుభవాలు స్మరించుకుంటూ. "ఇప్పటినుంచీ నీకీ వైరాగ్యమేమిటి నాయనా? అన్నివిధాలా నీవు ఇంకా చాలా అనుభవించవలసిన వాడవు, అనుభవించగలవాడవు కూడాను. ఎవరో ఒక్కరివల్ల ఏదో బాధ కల్గిందని, అందరివల్లా అదే బాధ కలుగుతుందనుకోకూడదు నాయనా, అసలు మానవుడి జీవితం సుఖదుఃఖాల కలయిక నాయనా, మానవుడెప్పుడూ ఆశతో జీవిస్తాడు. వెనకటి కష్టాల్ని మరిచి కొత్త సుఖాలకోసం ప్రయత్నిస్తూనే ఉంటాడు. లేకపోతే ఈ లోకంలో బ్రతుకే దుష్కరమవుతుంది

నాయనా. అందువల్ల వైరాగ్యంవదిలి నలుగురికీ ఆనందకరమైన పనిచేయి, నాయనా" అంటూ కొంచెం వేదాంత ధోరణిలో మాట్లాడి రాఘవయ్యగారివైపుకు తిరిగి "మీ వాడికి మీరు చెప్పిన సంబంధం విషయంలో అభ్యంతరమేమీ లేదని చెపుతూనే ఉన్నాడుగదా. ఇక మీరేమీ చింతపెట్టుకోక ఆ సంబంధమే స్థిరపరచివేయండి" అన్నారు. కాంతానికి మూర్తిమీద మళ్ళీ తిరుగుదెబ్బ కొట్టేందుకు అవకాశం కనిపించి "అవునండీ, అలాగే చేసివేయండి. ఇప్పుడు ఇలా ఉన్నా కొన్నాళ్ళకు ఆయన మనస్సు అదే మారుతుంది లెండి" అంది. మూర్తి మాత్రం తన పట్టు విడువలేదు. "లాభంలేదు నాన్నా. నాకోసం నీవేమీ ప్రయత్నం చేయకు" అన్నాడు మెల్లగా. "లాభం లేదేమిట్రా? మీ అమ్మ నీకోసం ఎంత బెంగపెట్టుకుందో తెలుసా. అస్తమానూ నిన్ను తలచుకుంటూ ఏడుస్తోంది. నాకు మాత్రం ఏం సంతోషం ఉంటుంది నీవిలా ఉంటే. కోదండరావు అదే పనిగా బ్రతిమాలుతున్నాడు తన కూతుర్ని చేసుకోమని. మన మేదో కట్టుసరి చేస్తున్నామని కూడా అనుకొని ఇంకో ఐదు వందలు ఇస్తాననికూడా అంటున్నాడు" అని రాఘవయ్యగారు చెపుతూంటే వెంకటప్పయ్యగారు ఆయన నాపి "ఎందుకండీ వీళ్ళతో ఇంతగా చెప్పడం. మా కాంతం కూడా ఇలాగే పెంకితనం చేస్తోందిగదా. అయినా ఇపుడు వెళ్ళి ఆ సంబంధంవారితో మాట్లాడి అన్నీ స్థిరపరచి వేయాలనుకుంటున్నాను. మీరూ అలాగే చేసివేయండి. మీవాడికి కొత్త పెళ్ళాం మొగం కనిపించేటప్పటికి ఎక్కడి వైరాగ్యం అక్కడికే మాయమవుతుంది లెండి" అంటూ నవ్వి "భోజనం చేసిన తర్వాత ఇద్దరం అలా పోయి అన్నీ ఆలోచించుకుందాం. ఆపైన నేను చెప్పిన మా అమ్మాయి సంబంధం వారి ఇంటికి వెళ్దాం" అన్నారు. "అలాగే" నన్నారు రాఘవయ్యగారు. ఇద్దరూ భోజనంచేసి బజారువైపుకు బయలుదేరారు. మూర్తి మొగం చిట్లించుకొని త్వరత్వరగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం అతను తిరిగివచ్చిన కొద్దిసేపటికే వెంకటప్పయ్యగారూ రాఘవయ్యగారూ వచ్చారు. కూడా ఒక బ్రాహ్మడు ఉన్నాడు. ముగ్గురూ కూర్చొని పంచాంగం తిరగవేసి వివాహ ముహూర్తాలు చూడసాగారు. కాంతం తన ఇష్టానికి వ్యతిరేకంగానే తనభవిష్యత్తు నిశ్చయం కాబోతోందని విచారంగా చూస్తూ కూర్చుంది. మూర్తి కూడా కొద్దిరోజుల్లో తనకు కూడా అలాగే అవుతుందని తలచుకుంటూ విచారంగా కూర్చొని చూస్తున్నాడు. ముహూర్తాలు చాలా చూశారు. ఆఖరికి ఒకటి బాగా కనిపించింది "బాగుంది కాని పదిహేను రోజులే వ్యవధి. కానైతే ఆ వ్యవధిలోనే అన్నీ చేసివేసుకోగలను నాకు పలికేవాళ్లు చాలామంది ఉన్నారు" అన్నారు రాఘవయ్యగారు. "నాకూ ఉన్నారండి. పదిహేనురోజులు దివ్యంగా సరిపోతాయండి." అంటూ బ్రాహ్మడు గొణగడం చూసి తాంబూలం అరటిపండూ తీసుకొని "మరి మళ్లీ ముహూర్తం దాటిపోతుంది ఇది తీసుకోండి బావగారూ" అంటూ వెంకటప్పయ్యగారు తాంబూలం రాఘవయ్యగారి చేతిలో పెట్టారు. మరోక తాంబూలం తీసుకొని మూర్తివైపుకు చేయి చాపారు. కాంతం, మూర్తి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మళ్ళీ చటుక్కున ఒకరి మొగాలొకరు చూసుకున్నారు. కాంతం మూర్తి కళ్ళలోకి ఒక క్షణం చూసి ఇట్టే సిగ్గు దొంతరలలో మునిగిపోయి, చీరకొంగు నోట్లో పెట్టుకొని తల వంచుకొని వంటింట్లోకి పరుగెత్తింది. మూర్తి ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. అంతలోనే అతను ఆపుకుందామన్నా ఆగక చిరునవ్వు అతని మొగమంతటా వెన్నెల ప్రాకినట్లు ప్రాకిపోయింది. రామం హుషారుగా గంతులేశాడు: "బలే, మామయ్యవల్లా బావయ్యావు! బాగుంది! ఇక నేను కూడా మీతోనే మకాం. వచ్చే యేడు ఈ ఊరి కాలేజీలోనే చేరుతాను. నాకీ ఊరునచ్చింది" అన్నాడు సంతోషం పట్టలేక. ★

రెండూ వాటర్ ప్రూఫ్ వాచీలు—
మరియు అవి రోలెక్స్ తయారే



మగవారికి బాగుండేది ట్యూడర్. దాని వాటర్ ప్రూఫ్ కేసు లోపున్న అతి ఖచ్చితముగ నడచే 17 జూయలుల యంత్రమును దుమ్ము, మలినము మరియు నీటినుండి సురక్షితముగా మంచును. బయట పనిగల ఆడవారికి ట్యూడర్ అయిస్టర్ మేము సిఫార్సు చేస్తాము. ఇది సంవత్సరములతరబడి పనిచేయును.

మా వద్దనున్న అన్ని రకముల ట్యూడర్ వాచీలు వచ్చి చూడండి. రాలేకపోతే మీకు ఉచితముగ క్యాటలాగు పంపుటకు సంతోషిస్తాము.

ట్యూడర్
వాచీలు
జెనీవా, స్విట్జర్లెండ్‌లో
తయారైనవి

దక్షిణ ఇండియాలో ఏకైక డిస్ట్రిబ్యూటరు:
మెస్సర్స్ పి. ఆర్ అండ్ సన్స్ లిమిటెడ్.
మౌంట్ రోడ్, మద్రాసు

R. 735